# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాదిగారు మొట్టమొదటిసారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

Ink is handicapped, in a way, because you can blow up a man with gunpowder in half a second, while it may take twenty years to blow him up with a book. But the gunpowder destroys itself along with its victim, while a book can keep on exploding for centuries.

\- Christopher Morley

## శ్రీ యం.బి.సింగ్



మైసూర్ ప్రింటర్స్ లిమిటెడ్ సంస్థ నుంచి డెక్కన్ హెరాల్డ్ అనే ఆంగ్ల దినపత్రికతో పాటు సుధ అనే వార పత్రిక, మయూరి అనే మాసపత్రికలు కూడా వస్తున్నాయి. 1970లలో నేను రచనలు చేయడం ఆరంభించాక నా కథలు, నవలలు కన్నడ భాషలోకి అనువదించబడి వీటిలో ప్రచురించబడేవి. 1974 లో ఓసారి నేను బెంగుళూర్ వెళ్ళినప్పుడు మహాత్మాగాంధీ రోడ్ లోని సుధ, మయూరి ఆఫీస్‌కి వెళ్ళి వాటి ఎడిటర్‌ని కలిసాను. ఆయన పేరు యం.బి.సింగ్. ఆయన నా పేరుని చెప్పగానే గుర్తుపట్టారు. ఆప్యాయంగా మాట్లాడారు. ఆయన కూతురు హైద్రాబాద్‌లో ఉండేది. ఒకటి రెండుసార్లు ఆయన హైద్రాబాద్ వచ్చినప్పుడు నన్ను డిన్నర్‌కి ఆహ్వానించారు. అబిడ్స్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో కలుసుకున్నా. ఉస్మానియా యూనివర్సిటీలో పని చేసే, వారి పత్రికల్లో రాసే ఆయన మిత్రుడు కూడా వచ్చారు. అతని పేరు గుర్తులేదు. అతను కన్నడ సినిమాలకి కూడా రచనలు చేసేవాడు. ఆ రోజు జరిగిన సంభాషణ నాకు గుర్తుంది. ఓ నిర్మాత అతన్ని బెంగుళూర్‌కి పిలిపించాడు. పగలే తాగించారు. అతను ఆ మత్తులో కథ మొత్తం చెపితే అసిస్టెంట్ ఎడిటర్ దాన్ని రాసుకున్నాడు. తర్వాత అతనికి డబ్బు ఇవ్వకుండా ఆ కథని సినిమాగా తీసేసారు. అది తెలిసిన యం.బి సింగ్ అతన్ని నా ముందే మందలించారు. ఆ రోజు చికెన్ బిర్యానీలో యం.బి.సింగ్‌కి ఓ ఇనప మేకు రావడం కూడా నాకు గుర్తుంది.

## శ్రీ హాసం రాజా



శ్రీ మంగు రాజా, నేను పల్లకికి రాస్తున్నప్పటి నుంచి, అంటే 1988 నుంచి నాకు పరిచయం. జంధ్యాలగారికి రాజా మిత్రుడు ఆయన కంపెనీలో కూడా రాజా కనిపించేవారు. మల్లాది వెంకటకృష్ణమూర్తి అనే వినూత్న నవలని రాజా రాసారు. తన ఫోటో ప్రచురించడానికి ఇష్టపడని రచయిత గురించిన కథ అది. సినిమా ప్రముఖులని కూడా ఆ నవల్లో పాత్రలుగా మలిచి రాయడం పాఠకులని విశేషంగా ఆకట్టుకుంది. ఈ రోజుకీ పాఠకులు ఆ నవల గురించి నాతో ప్రస్తావిస్తూంటారు. రాజాది అంతటి బలమైన కలం. అతనికి పాత తెలుగు పాటల మీద పట్టు ఉందని నాకు చాలా కాలం తెలీదు. ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కేవలం సినిమా మీద ప్రేమతో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారని అనుకునేవాడిని.



ఒకప్పుడు రేడియోలో వార్తలు చదివిన పన్యాల రంగనాధరావుగారు రాజాకి మేనమామ. వారు ఠాకూర్ వి. హరిప్రసాద్ గారి సినీహెరాల్డ్ అనే సినిమా వార పత్రికకి ఎడిటర్‌గా ఉండగా 1974 నుంచే రాజా అందులో సినిమాల మీద వ్యాసాలు రాసారు. తర్వాత పన్యాలగారు సితార ఎడిటర్‌గా వెళ్ళారు. పల్లకిలో రాస్తూండగా నాకు రాజాతో పరిచయం అయింది. తరంగిణి వార పత్రికకి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా పని చేసారు. ఆ తర్వాత ఆంధ్రభూమి వరదాచారి గారి సూచన మేరకి ఎ.బి.కె గారు 'వార్త'లో సినిమా సెక్షన్ ఇన్‌ఛార్జ్‌గా ఆయన్ని ఆహ్వానించారు. తర్వాత రామచంద్రమూర్తిగారు 'వార్త' ఎడిటర్‌గా ఉండగా కూడా రాజా అక్కడ కొనసాగారు. 2001లో శాంతా బయోటెక్స్ వరప్రసాద్ రెడ్డిగారి ఆరంభించిన 'హాసం' అనే మాసపత్రికకి ఎడిటర్‌గా చేరారు. ఆ పత్రిక ఎంతటి ప్రాచుర్యం పొందిందో అందరికీ తెలిసిందే హాస్యం, సినిమాలని మాత్రమే అందులోని కంటెంట్‌గా రూపొందించారు. రాజా నన్ను 'హాసం'కి కామెడీ సీరియల్ కావాలని కోరారు. ముందర తను శ్రీ వీరేంద్రనాథ్‌ని

కామెడి సీరియల్ కోసం కలిసానని, అక్కడ కుదరలేదని రాజా చెప్పినట్లు గుర్తు. 'సద్దాం ఆంటీ ఇంటి కథ' అనే కామెడీ సీరియల్ థీమ్ చెపితే రాజాకి నచ్చి దాన్ని అంగీకరించారు. అది 2002లో హాసంలో సీరియల్‌గా వచ్చింది. 2004లో అది మూసేసే దాకా రాజా అందులో ఉన్నారు. అప్పట్లో నాకు యం.బి.ఎస్ ప్రసాద్‌ని కూడా రాజానే పరిచయం చేసారు.

'హాసం' మంత్లీ ఎప్పుడు ప్రింటింగ్‌కి వెళుతుందో, నేను ఎప్పటికి సీరియల్‌ని ఇవ్వాలో నాకు ఓ అవగాహన ఉంది. ఆ ప్రకారం నేను నెలనెలా సీరియల్‌ని రాసి ఇచ్చేవాడిని. కాని రాజా పత్రిక మార్కెట్లో వెలువడిన వెంటనే సీరియల్ కోసం ఫోన్ మీద ఫోన్ చేస్తూండేవారు. 'దాన్ని మీ బల్ల సొరుగులో ఉంచుకోవడమే కదా చేసేది? లేదా కంపోజ్ అయితే కంప్యూటర్‌లో ఉంటుంది. కాబట్టి నాకు కొంత సమయం ఇస్తే ఇంకాస్త బెటర్‌గా రాస్తాను' అని చెప్పినా మర్నాడు మళ్ళీ 'సీరియల్ రెడీనా? ' అంటూ ఫోన్ చేసేవారు. ఇదొక్కటే నేను రాజా నుంచి ఎదుర్కొన్న ఇబ్బంది. నిజానికి ఈ కమిట్ మెంట్ రాజాలోని అతి గొప్ప మంచి లక్షణం. మనం ఏదైనా కోరితే చేస్తానని చెపితే, ఇక వెనక్కి వెళ్ళరు. మన వెంట పడి మరీ చేసి తీరతారు. అలాగే మనల్ని ఏదైనా కోరితే మన నించి అది వచ్చేదాకా విసుగు లేకుండా వెంటపడగల కార్యదీక్ష అతనిలో ఉంది. వ్యక్తిగతంగా రాజా ఎంతో మర్యాదస్తుడు.




రాజా కార్య దీక్షకి మరో నిదర్శనం మాటీవీలో సీనియర్ మేనేజర్‌గా చేసిన 'గుర్తుకొస్తున్నాయి' శీర్షిక. అలనాటి అరవై మందికి పైగా సినీ ప్రముఖుల జ్ఞాపకాలని ఈ శీర్షిక ద్వారా పరిచయం చేసారు. వీటిలో సింగీతం శ్రీనివాసరావు ఎపిసోడ్‌కి రాజాకి నంది అవార్డ్ వచ్చింది. ఇవికాక అక్కినేని నాగేశ్వరరావు ఎపిసోడ్స్ 70 పైగా ఉన్నాయి. అవి 'అక్కినేని జ్ఞాపకాలు' పేరుతో సీడిలుగా కూడా విడుదలయ్యాయి. సాధారణంగా ఫిల్మ్ జర్నలిస్ట్‌లంటే లంచగొండులు అనే చిన్నచూపు తెలుగు సినిమా పరిశ్రమలో ఉంది. రాజా ఇందుకు విరుద్ధం. నిజాయితీ పరుడు. ఉదాహరణకి అక్కినేని నాగేశ్వరరావుగారు గుర్తుకొస్తున్నాయి తర్వాత కృతజ్ఞతగా రాజాకి కొంత డబ్బు ఇవ్వాలనుకుంటే తను పని చేసే మాటివి వారికి రాజా ఈ విషయం చెప్పారు. 'మీరు చెప్పకపోతే అది లంచం అయేది. చెప్పారు కాబట్టి బహుమతి' అని అందుకు వారు అనుమతిని ఇచ్చారు. నాగేశ్వరరావు గారి సంతకం గల ఆ చెక్‌ని రాజా కాపీ తీసి లామినేట్ చేయించారు. ఆ డబ్బుతో ఓ బంగారు కంకణం కొని, ఇంట్లో అది నాగేశ్వరరావుగారు ఇచ్చిందని రాసిపెట్టారు. రాజా గురించి పూర్తిగా ఆవిష్కరించడానికి కొన్ని ఉదాహరణలని మాత్రమే చెప్పాను.

రాజా పాటని ఎంతగా ప్రేమిస్తారు అన్నది ఆయన మాటల్లో..

" నా పుట్టుక తల్లిదండ్రులది

చావు భార్యాబిడ్డలది

బతుకు తెలుగు సినిమా పాటది"

**<u>శ్రీ జలదంకి ప్రభాకర్</u>**

నాలుగేళ్ళ క్రితం నది మాస పత్రిక నుంచి ఫోన్ వచ్చింది.

"నా పేరు జలదంకి ప్రభాకర్. నది మంత్లీ ఎడిటర్ని. ఓసారి వచ్చి మిమ్మల్ని కలవాలని ఉంది." అవతల నుంచి చెప్పారు.



శ్రీ ప్రభాకర్ మర్నాడు నన్ను కలిసారు. నా రచనలన్నా, వీరేంద్రనాథ్ రచనలన్నా ఆయనకి బాగా అభిమానం అని, ఆంధ్రభూమి వీక్లీ సర్క్యులేషన్ ఎదుగుదలకి మేమిద్దరం దోహదం చేసామని ఆయన నమ్ముతారని ఆయన మాటలని బట్టి అనిపించింది. తమ పత్రికకి ఏదైనా కాంట్రి బ్యూషన్ కావాలని కోరారు. ఆధ్యాత్మిక స్నిప్పెట్స్ కొన్ని పంపితే అవి నచ్చి 'అంతర్వాణి' పేరుతో కొంత కాలం వాటిని ప్రచురించారు. ఈ నెల్లోనే అది పుస్తకంగా వెలువడుతోంది. పుస్తకం అచ్చులో ఉంది.

కొద్ది కాలానికి ప్రభాకర్ నన్ను సీరియల్ రాయమని కోరారు. ఆయన్ని ఏ రకం సీరియల్ కావాలని అడిగితే డిటెక్టివ్ నవలని కోరారు. ఫోన్‌లో తన మేనేజింగ్ ఎడిటర్ శ్రీ రావ్ అవ్వాస్ గారితో మాట్లాడించారు. వారు కూడా సస్పెన్స్ థ్రిల్లర్ అయితే బావుంటుందన్నారు. కానీ నా దగ్గర ఆ రోజుకి అలాంటి థీమ్ సిద్ధంగా లేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల లంచ గొండితనం నేపథ్యంలో అల్లుకున్న ఓ థీమ్‌ని చెపితే, దాన్ని ఆయన ఓకే చేస్తూ చెప్పారు.

"బావుంటే పాఠకులు మిమ్మల్ని మెచ్చుకుంటారు. లేదా మిమ్మల్నే విమర్శిస్తారు."

నది మంత్లీలో 'ది ఎండ్' పేర అది సీరియల్ గా వెలువడింది.

ఆ తర్వాత హైదరాబాద్ నుంచి వారి ఆఫీస్ విజయవాడకి షిఫ్ట్ అయింది. ఓ రోజు జలదంకిగారు ఫోన్ చేసి కథని ఇస్తే, వీరేంద్రనాథ్ కథనంతో సీరియల్‌ని రాసే కొత్తప్రక్రియ అనే ఆలోచన వచ్చిందని, అందుకు నాకు ఇష్టమేనా అని అడిగారు. నేను నా అంగీకారాన్ని చెప్పి, నాకు తెలిసి శ్రీ వీరేంద్రనాథ్ అందుకు అంగీకరించరని చెప్పాను. కానీ వీరేంద్రనాథ్ ఒప్పుకున్నాకే నన్ను కాంటాక్ట్ చేసానని, ఆయన అంగీకరించారని చెప్పారు. కొన్ని నెలలు నదిలో ఈ మేరకి ప్రకటనని కూడా వేసారు. అది ఆరంభం అవడానికి కొద్ది కాలం ముందు వీరేంద్రనాథ్‌కి కథ సినాప్సిస్‌ని కాగితం మీద పెట్టి పంపుతానని స్థూలంగా కథని వివరించాను. ఆయన తను సీరియల్ అనుకోలేదని, చిన్న కథ అనుకున్నానని సీరియల్ అయితే రాయనని చెప్పారు. అతని గురించి బాగా తెలిసిన నాకు అది ఆశ్చర్యం కలిగించలేదు. తర్వాత ప్రభాకర్ ఫోన్ చేసి 'ప్రకటించాం కదా? ఏం చేద్దాం?' అని సలహా అడిగితే ఇంక దాని ప్రస్తావన తీసుకురాకుండా సైలెంట్‌గా ఉండమని సూచించాను. మా సీరియల్ వేయలేదేమని పాఠకుల నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ రాలేదని తర్వాత ఎప్పుడో ప్రభాకర్ చెప్పారు.

2011 జూన్‌లో అనుకుంటా నేను శ్రీ ప్రభాకర్‌కి ఫోన్ చేసి కొన్ని అమెరికన్ డిటెక్టివ్ కథలని తెలుగులోకి అనువదించానని, వాటిని పంపిస్తే నదిలో ప్రచురిస్తారా అని అడిగాను. "మాకేంటి సార్? మీరు ఏం ఇచ్చినా వేస్తాం. బావుంటే పాఠకులు మిమ్మల్నే మెచ్చుకుంటారు. బాగోలేకపోతే మిమ్మల్నే తిట్టుకుంటారు" అదే నిర్మొహమాటమైన సమాధానం వచ్చింది.

కమర్షియల్ రచయిత మీద సంపాదకుడికి ఉండాల్సిన విశ్వాసం ఆయనలో ప్రగాఢంగా ఉంది అని మరోసారి ఋజువైంది. ఆ విశ్వాసంలో కల్తీలేదు. అనువాద డిటెక్టివ్ కథలని డిటెక్టివ్ కథలు శీర్షిక పేర నదిలో శ్రీ జలదంకి నెలకి ఒకటి చొప్పున ప్రచురిస్తున్నారు. అదృష్టవశాత్తు వాటిని పాఠకులు బాగా చదువుతున్నారు. అలాగే వారి సంస్థ నుంచి వచ్చే 'వారం వారం' అనే టాబ్లాయిడ్ వార పత్రికలో 'మినీ మిస్టరీస్' అనే శీర్షికలో కూడా కాలందాటని అనువాద డిటెక్టివ్ కథలని ఇటీవలే ఆరంభించాను. నేను వారికి ఓ సస్పెన్స్ సీరియల్ ఇంకా రాయాల్సి ఉంది.

కావలి వాస్తవ్యులైన జలదంకి ప్రభాకర్‌గారు ఆంధ్రభూమి డైలీకి 1980-81లో కాంట్రిబ్యూటర్‌గా రంగప్రవేశం చేసారు. కాలేజీలో శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, ఎస్వీ భుజంగరాయ శర్మ వీరికి లెక్చరర్స్. 1975లో నిడుబ్రోలు తాలుకా ఆఫీసులో ఎల్.డి.సిగా ఐదారు నెలలు పనిచేసి రాజీనామా చేసారు. తర్వాత సబ్ కలెక్టరేట్‌లో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా చేసారు. ఆ తర్వాత ఓ ఏడాది పాటు అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్ వైజర్‌గా కూడా తెనాలిలో పనిచేసారు. 1982-83లలో కావలివాణి అనే పక్షపత్రికని నడిపారు. 1985లో

నెల్లూరు జిల్లాకి ఆంధ్రపత్రికకి రిపోర్టర్‌గా పనిచేసారు. 1992లో ఆంధ్రపత్రిక లాకవుట్ దాకా పత్రిక స్టాఫ్ రిపోర్టర్‌గా కొనసాగారు. కావలి నుంచి జిల్లా స్థాయిలో వందేమాతరం అనే పక్షపత్రికని కూడా తెచ్చారు. ఆ తర్వాత ఆంధ్రప్రభలో నాలుగు జిల్లలకి బ్యూరో చీఫ్‌గా తిరుపతిలో 2002 దాకా పనిచేసారు. తర్వాత 2003లో అగ్రిగోల్డ్ సంస్థ ప్రారంభించిన నది మాస పత్రిక మొదలైంది. 2006లో అసోసియేట్ ఎడిటర్‌గా నదికి వచ్చి, 2007 నుంచి దానికి ఎడిటర్ ఇన్ ఛార్జ్‌గా కొనసాగుతున్నారు.

వీరు ఆంధ్రజ్యోతిలో పాత్రికేయుడిగా, తర్వాత ఎడిటర్‌గా పనిచేసిన, నేడు మహా టీవీలో ఎడిటర్ గా ఉన్న శ్రీఐ.వెంకట్రావుని బాగా అభిమానిస్తారు. ఆయన రాసిన ఉలుకు - పలుకు శీర్షికని వీరు రాయడం అభ్యసించడానికి చూసి రాసేవారు. నాకు తెలిసి ఇలా రాయడం నేర్చుకుంది ఆంగ్ల రచయిత సోమర్‌సెట్ మామ్. కొత్తల్లో ఆయనా ఇలా చూసి రాసేవారని మామ్ ఆత్మకథలో చదివాను.

రచయితగా నా మీద గౌరవ భావం, నేను రాసేవి పాఠకులు ఆదరిస్తారనే నమ్మకం గల అతి తక్కువ ఎడిటర్స్‌లో శ్రీ ప్రభాకర్ ఒకరు. మరొకరు శ్రీ యజ్ఞప్రసాద్.

**_శ్రీ యజ్ఞప్రసాద్_**



విజయవాడ నుంచి చిత్ర మంత్లీ ఆరంభం కాక మునుపు దాని ప్రొప్రయిటర్ శ్రీ రాజా, దాని ఎడిటర్ శ్రీ యజ్ఞప్రసాద్ మా ఇంటికి వచ్చారు. వారు నా సీరియల్ కోరితే రెండు థీమ్స్ చెప్పాను. అందులో వారు ఎన్నుకున్న థీమ్‌ని సీరియల్‌గా 'అనగనగా ఓ నాన్న' పేర రాసాను. ఇటీవలే ఆ నవల 'చిత్ర' పత్రికలో పూర్తయి, పుస్తకంగా వెలువడింది. తమ యువ పాఠకుల కోసం చిత్ర మంత్లీలో 'హాట్ హాట్‌గా' అనే శీర్షికని కూడా యజ్ఞప్రసాద్‌గారు స్వయంగా అడిగి రాయిస్తున్నారు. వారి సంస్థనుంచే యజ్ఞప్రసాద్ ఎడిటర్‌గా వెలువడే మరో మాసపత్రిక 'భక్తిసుధ'లో 'వివేకధార' అనే శీర్షికని రాస్తున్నాను.

1976లోనే ఇంటర్మీడియెట్ విద్యార్థిగా ఉండగా తెనాలి నుంచి యజ్ఞ ప్రసాద్ ఆంధ్రవాహిని అనే లిఖిత మాసపత్రికని పండరీనాథ్ (నేడు ఆంధ్రభూమి వీక్లీలో ఇల్‌స్ట్రేషనిస్ట్) బొమ్మలు, సుసర్ల కార్టూన్లతో ఎనిమిది నెలలపాటు వెలువరించారు. 1997లో ఆంధ్రప్రభలో, 1998లో ఈనాడులో విలేఖరిగా పనిచేసారు. తర్వాత సిటీ కేబుల్ స్క్రిప్ట్ రైటర్ గా పనిచేస్తూ సూపర్ హిట్ హంగామా అనే శీర్షికలో హాస్య స్కిట్స్‌ని రాసి వాటిలో నటించారు. కొద్దికాలం సుధామయి అనే మాసపత్రికని ఎడిట్ చేసారు. అది అట్టే నెలలు రాలేదు. 2007లో భక్తిసుధ మాసపత్రికలో ఎడిటర్‌గా చేరారు. తర్వాత అదే సంస్థ స్థాపించిన చిత్ర మాస పత్రికకి కూడా ఎడిటర్ అయ్యారు.

చిత్ర మంత్లీ మా ఇంటికి సమీపంలోని కళాజ్యోతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్‌లో అచ్చవుతుంది. శ్రీ యజ్ఞప్రసాద్ నెలనెలా ఆ పనిమీద హైదరాబాద్ వచ్చి వెళ్తూంటారు. ఎప్పుడైనా మా ఇంటికి వచ్చి కలుస్తూంటారు. ఇంత దాకా ఏ ఎడిటర్ నన్ను గౌరవించని విధంగా, చిత్రలో 'అనగనగా ఓ నాన్న' పూర్తయిన సందర్భంలో ప్రసాద్ నాకు బట్టలు పెట్టి ఆనందంతో కూడిన ఆశ్చర్యాన్ని కలిగించారు.

**_శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి_**

ఆంధ్రభూమి డైలీకి శ్రీ యం.వి.ఆర్ శాస్త్రి ఎడిటర్ అయ్యాక 1995లో ఓసారి నాకు కబురు చేసి తమ డైలీకి ఏమైనా సీరియల్‌ని రాయమని కోరారు.

అప్పటికే మయూరి వీక్లీలో ముఖాముఖి ప్రశ్నోత్తరాలలో ఓ పాఠకుడి ప్రశ్నకి సమాధానంగా కొత్తగా రాయబోయే పుస్తకం గురించి చెప్పాను. కొత్త రచయితలకి మార్గదర్శకత్వంగా ఉండేలా కథలు రాసే పుస్తకం ముందు రాద్దామనుకుంటున్నానని, తర్వాత సీరియల్ రాస్తానని చెప్పాను. కథ రాయడం మీద టిప్స్‌తో కూడిన వ్యాసావళి రాస్తానంటే, శ్రీ శాస్త్రి ఒప్పుకున్నారు. పాఠకుల అభిప్రాయాలని కూడా నిర్మొహమాటంగా ప్రచురిస్తానని ముందే చెప్పారు. 'కథలెలా రాస్తారు?' అనే పేర వారి 'సాహితి' పేజీలో దాన్ని

రాసాను. అయితే నేను రాసిన దాన్ని వేళాకోళం చేస్తూ రాసిన అవకతవక ఉత్తరాలు కూడా అందులో ప్రచురించబడటం నన్ను బాధించింది. దాంతో శాస్త్రిగారికి గుడ్‌బై చెప్పేసాను. ముందు అనుకున్నట్లుగా వారికి నేను సీరియల్ రాయాల్సి ఉన్నా రాయలేదు. ‘కథలెలా రాస్తారు?‘ పూర్తయ్యాక పుస్తకంగా వెలువరించాను.



ఐదారేళ్ళ తర్వాత ఆంధ్రభూమి వైజాగ్ ఎడిషన్ న్యూస్ ఎడిటర్ శ్రీ యం. రాజగోపాల్ ఓసారి మా ఇంటికి వచ్చి, తనకి హైదరాబాద్ బదిలీ అయిందని, శాస్త్రిగారు భూమికి ఏమైనా రాస్తారేమో కనుక్కోమన్నారని అడిగారు. ‘కథలెలా రాస్తారు?‘ విషయంలో నా అనుభవం చెప్పాను. శ్రీ శాస్త్రి ఎడిటర్‌గా ఉన్న ఏ పత్రికకి నేను రాయనన్ని, ఆయనకి సంపాదకత్వం తెలీదని, కోరి తను రాయించుకున్నది ఎవరైనా సద్విమర్శ చేస్తే వేయడంలో అందం ఉంది కాని అసంబద్ధ విమర్శని వేస్తే, అలాంటి అసమర్ధ రచనని ఎంపిక చేసింది తనే కాబట్టి ఆ విమర్శ కేవలం రచయితని ఉద్దేశించిందే అని ఆయన అనుకున్నా, సంపాదకుడిగా ఆయనలోని లోపాన్ని కూడా అది ఎత్తి చూపిస్తుందన్న అవగాహన ఆయనలో లేదని కోపంగా చెప్పి తిరస్కరించాను.

2010లో ఓ రోజు ఆంధ్రభూమి డైలీ నుంచి ఒకతను ఫోన్ చేసి తన పేరు వి.ఎస్.ఎస్.మూర్తి అని, తను సండే సప్లిమెంట్ ఇన్‌ఛార్జి ఎడిటర్‌ని అని, తమకేమైనా రాయమని కోరారు. గతంలో వైజాగ్‌లో నాతో అతనికి గల పరిచయాన్ని గుర్తుచేసారు. 1990లో తేనెటీగ సినిమా షూటింగ్ కోసం నేను వైజాగ్ లో ఓషన్ వ్యూ హోటల్లో బస చేసినప్పుడు భూమిలో పనిచేసే ఓ యువకుడు నా గదికి వచ్చి అందులో నేను రాసే కృష్ణశబ్దంని కాపీ చేసి చూపించేవాడు. అతను చాలా సాత్వికుడు, ఎలాంటి చెడ్డ అలవాటూ లేదు, మౌనంగా తన పనిని చేసుకుపోయేవాడు కాబట్టి నాకు అతను గుర్తుండిపోయాడు. నేను డ్రింక్ తీసుకోవడం అతన్ని బాధించేది. జాయింట్ ఫేమిలీ నుంచి వచ్చిన అతను తన కుటుంబ సభ్యుల గురించి చెప్పేవాడు. అప్పుడు నాకు తోచలేదు కానీ, నేను ఆధ్యాత్మిక మార్గంలోకి అడుగుపెట్టాక అతను సూచించినట్లు ఆ రోజుల్లోనే చెడ్డ అలవాట్లని మానేసి ఉంటే బావుండేది అని అనిపించేది. నాకు అనేకసార్లు ప్రతికారంగంలోని కేవలం అతనే గుర్తుకు వచ్చేవాడు. అతనే వి.ఎస్.ఎన్.మూర్తి అని మా సంభాషణ వల్ల తెలిసింది. శాస్త్రిగారితో సహా చాలామందిమీద నాకు గల కోపం కూడా అప్పటికే పూర్తిగా వీగిపోయింది. ముందు భూమి డైలీలోని అర్చన పేజీలో ప్రణతి అనే ఆధ్యాత్మిక శీర్షికని, సిసింద్రీ పేజీలో స్ఫూర్తి కథలని (అదిప్పుడు పిల్లల హిత కథలు అనే పేరుతో పుస్తకంగా వెలువడింది) సండే సప్లిమెంట్‌లో మూర్తిగారు ప్రచురించారు.

"ఓసారి శాస్త్రిగారు మిమ్మల్ని కలవాలని అంటున్నారు" అని ఆ తర్వాత మూర్తిగారు చెపితే నేను ఓ సాయంత్రం భూమి ఆఫీస్‌లో వారిని కలిసాను.

‘కథలెలా రాస్తారు?‘ ప్రచురణ సందర్భంలో జరిగింది వివరించాను. ఆయన మీద కోపం రావడం, రాజగోపాల్‌తో చెప్పిన విషయాలు చెప్పి, ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక ఆ కోపతాపాలన్నీ మాయమయ్యాయని చెప్పాను. ఆశ్చర్యంగా ఆయన ఓ మాట అన్నారు.

"నేను రాసినవి కూడా తిడుతూ వచ్చిన ఉత్తరాలని ప్రచురిస్తాను. వాటిని నేను పట్టించుకోను. సమర్ధించను కూడా. నా అభిప్రాయం నాది. ఆ పాఠకుడి అభిప్రాయం ఆ పాఠకుడిది."

నాలో ఇలాంటి పాజిటివ్ దృక్పథం ఆనాడు ఎందుకు కొరవడిందా అని తక్షణం అనిపించింది. పత్రిక ఎడిటర్స్‌లో ఇలా తనమీద వచ్చే విమర్శలని ప్రచురించేవారు అరుదు. దానికి రియాక్ట్ కాకపోవడం ఇంకా అరుదైన విషయం. ఆధ్యాత్మికంగా ఇది అహం లేకపోవడం.

శ్రీ యం.వి.ఆర్ శాస్త్రి బయట పడరు కానీ ఆయనలో ఆధ్యాత్మిక తపన చాలా తీవ్రంగా ఉందని వారితో మాట్లాడాక నాకు ఆరోజు అర్ధమైంది. ఆరోజు, ఆ తర్వాత మరో రెండుసార్లు వారిని కలిసినప్పుడు ఎక్కువగా అద్వైతం గురించే మాట్లాడుకున్నాం. ఆయన

కూతురు పల్లవి పెళ్ళికి ఆహ్వానిస్తే వెళ్ళాను. శ్రీ శివానందమూర్తి, శ్రీరామ్ గారు, శ్రీ కుప్పాకృష్ణమూర్తి, శ్రీ విశ్వయోగి విశ్వంజీ, కొందరు మఠాధిపతులు దానికి హాజరవడం, శ్రీ శాస్త్రికి ఇంత మంది ఆధ్యాత్మిక వేత్తలతో పరిచయం ఉండటం నాకు విస్మయాన్ని కలిగించింది. ఆధ్యాత్మికత వ్యక్తిగతంగా ఉండాలి తప్ప, బహిర్గతం కాకూడదనే ఆదర్శాన్ని శ్రీ శాస్త్రి పాటిస్తున్నారు అని ఆ రోజు అర్థమైంది. వారి అన్నయ్యకూడా అక్కడ పరిచయమయ్యారు. వారి మాటలని బట్టి ఆధ్యాత్మిక సంస్కారంగల కుటుంబం నుంచి శ్రీ శాస్త్రిగారు వచ్చారని కూడా నాకు అర్థమైంది.

శ్రీ కనకాంబర రాజు తర్వాత పత్రిక అభివృద్ధిలో రచయితలు, జర్నలిస్ట్‌లని భాగస్వాములుగా చేయడం, వారిని కొత్త ఆలోచనలు ఇవ్వడానికి ప్రోత్సహించడం ఒక్క యం.వి.ఆర్ శాస్త్రిలోనే చూసాను. నేను కలిసిన రెండు సందర్భాల్లో ఇలాంటి చర్చ చేసే వారే నాకు అక్కడ తారసపడ్డారు. ఆంధ్రభూమి డైలీలో శ్రీ శాస్త్రిగారు ఆరంభించిన కొన్ని విభిన్న శీర్షికలు తోటి దినపత్రికలు అనేక సందర్భాలలో తమ పత్రికల్లో అనుసరించారు.

రచయితలకి తప్పనిసరిగా పారితోషికం ఇవ్వాలని, అదీ సాధ్యమైనంత ఎక్కువగా ఉండాలని కోరుకునే వ్యక్తి శాస్త్రి. ఆ విషయంలో మేనేజ్‌మెంట్ దగ్గర ఆయన చొరవ తీసుకుంటారు. మా మొదటి మీటింగ్‌లో ఆయన రాసిన ‘ఇదీ చరిత్ర‘ అనే పుస్తకాన్ని కాంప్లిమెంటరీగా ఇచ్చారు. భారతదేశ చరిత్ర వక్రీకరించిన ఎన్నో విషయాలని ఆయన అందులో వివరించారు. మనసులోని ఏ మాటనైనా నిస్సంకోచంగా ఆయన దగ్గర చెప్పచ్చు. అందుకు రియాక్ట్ అవడం, దాన్ని మనసులో ఉంచుకోవడం లాంటివి ఆయనకి తెలీవు. ఓసారి నా కారు డ్రైవింగ్ లైసెన్స్ ఎక్స్‌పైరీ అయిపోయింది. నేను రెండుసార్లు ఆర్టీవో కార్యాలయానికి వెళ్ళినా టోకెన్ దొరక్క వెనక్కి తిరిగి వచ్చాను. నేను వారి ఆఫీస్‌కి ఆటోలో వచ్చానని తెలిసి వి.ఎస్.ఎన్.మూర్తి శాస్త్రిగారితో ఆ విషయం చెప్పారు. ఆయన డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఎక్స్‌పైరీ అయిపోయింది. నా బాధ గ్రహించి తను ఆర్టీవో కార్యాలయానికి వెళుతూ మా ఇంటికి వచ్చి, తన కారులో అక్కడికి వెంట తీసుకెళ్ళి నా పని కూడా చేయించారు. తర్వాత తన కారు డ్రైవర్‌తో డ్రైవింగ్ లైసెన్స్‌ని మా ఇంటికి పంపారు. ఇదీ ఆయన స్వభావం.

**శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తి**



వైజాగ్ నుంచి హైదరాబాద్ బదిలీ మీద వచ్చిన శ్రీ వి.ఎస్.ఎన్. మూర్తి భూమి డైలీకి నేను రాసేందుకు దోహదం చేసారు. వారి నుంచి రచయితగా నాకు చక్కటి సహకారం అందుతోంది. నా చేతివ్రాతతో పంపినా దాన్ని ఆయన అర్థం చేసుకోగలరు కాబట్టి అనేక మంది ఇతర ఎడిటర్స్‌లా ఫెయిర్ కాపీ చేయించి పంపాలన్న ఆంక్షని విధించకుండా సహకరిస్తున్నారు. ఎక్కువమంది సంపాదకులకి నేనంటే రచయితగానే అభిమానం. కానీ శ్రీ వి.ఎస్.ఎన్.మూర్తికి మాత్రం వ్యక్తిగతంగా కూడా నేనంటే అభిమానం. ప్రస్తుతం ‘మల్లాది మిరియాలు‘ అనే శీర్షికతో నేను అనువదించిన విదేశీ సస్పెన్స్, ట్విస్ట్ కథలని వారు ప్రచురిస్తున్నారు. మిస్టరీ స్టోరీస్ పేరిట వాటిని మొదటి సంపుటిగా వెలువరించను. ఇంకోటి రావాల్సి ఉంది. ఆసక్తిగా ఉండే ఈ మెయిల్స్‌ని తరచు నాకు మూర్తిగారు ఫార్వర్డ్ చేస్తుంటారు.

**శ్రీ లక్ష్మణరావు**

‘అమావాస్య‘ అనే మాసపత్రికతో లక్ష్మణరావు అనే అతను ఓ రోజు వచ్చి దానికి ఏదైనా రాయమని కోరారు. కేవలం దెయ్యాలు, క్షుద్రశక్తులు, తాంత్రిక విద్యలు ఇతివృత్తంగా గల పత్రిక అది. నేను అలాంటివి రాయలేనని చెప్పాను. పత్రిక బాగుకోరి, పాఠకులు ఇలాంటివి అట్టే కాలం చదవరని, దాన్ని అపరాధ పరిశోధనా పత్రికగా మార్చమని చెప్పాను. అక్షరం ద్వారా పాఠకుడ్ని భయపెట్టాలన్నది తనకి చిన్నప్పటి నుంచి గల కలని చెపితే, నేడు అది సాధ్యం కాదని చెప్పాను. అధిక భాగం తనే అందులోవి రాస్తున్నానని చెప్పారు.

లక్షరూపాయలకి నవలకి బహుమతిని ప్రకటించారు. ఇప్పుడు కాంప్లిమెంటరీ కాపీలు నాకు అందడంలేదు కాబట్టి అమావాశ్య కూడా కనుమరుగైపోయిందనే అనుకుంటున్నాను.

***(ముగింపు వచ్చే సంచికలో)***

**Click here to share your comments on this story**

*ప్రస్తుతం లభ్యమౌతున్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*